# కురూపి

**ఆ**విడ అనాకారి కాదు కాని బక్కచిక్కిన మనిషి. దవడలు బొత్తిగా అంటుకు పోయినై. కళ్లు విశాలమైనవైనా లోతుకు పోయినై. రొమ్ము ఎండిపోయింది. కాళ్లూ చేతులూ ఊచలే. నడుముకూ పిరుదలకూ వ్యత్యాసం లేకుండా ఒకటో అంకెలాగా ఉండేది.

ఆవిడ భర్త తన ఈడువాళ్లనీ, తనకంటె చిన్నవాళ్లనీ, తనకంటె చాలా పెద్దవాళ్లనీ అనేకమందిని చేరదీసేవాడు. నిత్యమూ వారింటికి వస్తూ ఉన్న వారిలో అతను చాలా అందగాడు, కుర్రవాడు. పాతికేళ్లు వెళ్లినవో లేవో, అతని దర్శనం ఏ ఆడదానికన్నా ఆనందం ఇవ్వగలగవచ్చు. అతను తనకేసి నవ్వితే ఏ ఆడదీ మరవలేదనిపిస్తుంది.

అతనికి ఒకరిద్దరు ఆడవాళ్లతో సంబంధం ఉన్నట్టు ఆమె విన్నది. అందుచేత అతను బొత్తిగా ప్రవరుడనుకోవలసిన అవసరం లేదు.

తన పరిశోధన కోసం ఆమె ఆ కుర్రవాణ్నెన్నుకుంది.

ఆమె తనకేసి వింతగా చూడటం అతను త్వరలోనే గమనించాడు. అతనికి కొత్తలో అసహ్యం వేసింది. ఎండిపోయిన ఆవిడ రొమ్మూ, నరాలు తేలిన ఆవిడ పొడుగాటి మెడా స్మరించుకుని నవ్వుకున్నాడు.

నాలుగైదురోజులు గడిచిన తరవాత అకస్మాత్తుగా అతని హృదయంలో ఒక భావం మెరిసింది – ఆవిడ సన్నతనంలో ఎంత నాజూకున్నది!

ఇటువంటి ఆలోచన కలిగినందుకతనికి ఆశ్చర్యం వేసింది. తను ఆ శవంలో ఏదో మంచి చూడగలగటం ఏమిటి? పుష్టి అయిన వక్షమూ, నిగనిగలాడే తొడలూ, కంఠమూ, పాలుగారే చెక్కులూ ఎరిగిన తను !

కాని ఆమె సన్నదనంలో ఏదో నాజూకు – సౌకుమార్యం – ఉన్నదనే ఆలోచన అతని తలలోనించి పోలేదు. పైగా మరింత దృఢం కాసాగింది.

ఒకనాడతను ఆమె కళ్లకేసి చూశాడు. అతని కప్పటివరకూ ఆడవాళ్ల కళ్లల్లో తేడాలు తెలీవు. ఈ కళ్లెంత అగాధంగా ఉన్నై! ఇతరుల కళ్లల్లో ఏముంది? కనురెప్పలూ, కనుగుడ్డూ, నల్లగుడ్డూ, పాపం! ఈ కళ్లల్లో బ్రహ్మాండం తాలూకు రహస్యమంతా ఉంది!

ఆ రోజల్లా అతనికా కళ్లు జ్ఞాపకం వస్తూనే ఉన్నై.

మరో రోజు ఆమె, ఆవిడ భర్తా, అతనూ మాత్రమే ఉన్నప్పుడు ఒకమాట అన్నది.

"ప్రేమలూ, గీమలూ చెప్పకండి. ఒకటే ప్రేమ ఉంది ప్రపంచంలో – పరమ కురూపికి నవమన్మథుడిమీదా, నవమన్మథుడికి కురూపిమీదా కలిగే ప్రేమ! అది

అంటుకుంటే చల్లారదు. ప్రపంచాన్ని భస్మం చేస్తుంది. మిగిలిన ప్రేమలన్నీ ఇస్త్రీవాయినం, పుచ్చుకుంటి వాయినం!"

అతను దద్దరిల్లి పోయినాడు. నాలుక పొడారింది. ఆమె భర్తకేసి చూశాడు.

ఆమె భర్తకూడా విస్మయపడ్డవాడల్లే మిగిలిన ఇద్దరికేసి రెండుసార్లు చూసి పెద్ద పెట్టున నవ్వాడు.

ఆవిడ తన చేతివేళ్లకేసి చూసుకుంటూ నిశ్చలంగా కూచుంది.

అతని కారోజల్లా ఇంకో ఆలోచనే లేదు. ఆమెను ఒక్క క్షణం కూడా మరవలేనట్టయింది. ఆమె చెప్పింది నిజం. ప్రేమతో పోలిస్తే కామం ఏపాటిది? ఎంత గోరు వెచ్చనిది! ఆమె తనను ప్రేమిస్తున్నది. తను ఆమెను ప్రేమించకుండా ఉండటం అసంభవం! గోగుపుడకలాంటి ఆమె శరీరంలో రక్తంకాదు, అగ్ని ప్రవహిస్తున్నది. తను అదివరకెరిగిన ఆడవాళ్లు, నీళ్లకుండలు! అరటిబోదెలు! ఆవిడ హాలాహలం! అదే కావాలి తనకు.

ఆ రాత్రి అతనికి ఆలస్యంగా నిద్రపట్టింది. కల వచ్చింది. ఆమె వచ్చిన తన సరసనే పడుకుంది. ఆమె చేతులు తన చుట్టూ వెయ్యగానే తన శరీరంలో విద్యుత్ ప్రవహించింది. ఆమె మొహానికేసి తన మొహం అదుముకుంటే గుచ్చుకున్నది. ఆమె కళ్లల్లోకి చూస్తే గాఢాంధకారం. ఆ గుడ్లల్లో ఏమీలేదు. మొహం వెనక్కు లాగి చూచునుగదా తన పక్కన పడుకుని తన చుట్టూ చేతులు వేసినది మనిషి కాదు – అస్థిపంజరం...

మర్నాడు అతను నూరు డిగ్రీల జ్వరంతో ఆమెను చూడబోయినాడు. "నిన్ను విడిచి బతకలేను. నన్ను చంపకు. నువు నాదానివైతే నేనీ మరుక్షణం చావటానికైనా లెక్కచెయ్యను" అని మనస్సులో ఆవిడతో అంటూ ఇంటో ప్రవేశించాడు.

ఆమె ఒంటరిగా ఉంది. అతని జ్వరం మరో రెండు డిగ్రీలు పెరిగింది. అతని నోరు స్వాధీనం తప్పింది. మహత్తరమైన శక్తి ఏదో తనని ప్రేరేపిస్తున్నట్టుగా అతను ఆమె పక్కనే కూర్చుని బెండువంటి ఆమె శరీరాన్ని దగ్గిరికి తీసుకుని కండలేని ఆమె మూతి ముద్దుపెట్టుకున్నాడు. అతని మొహాన చెమట కాలవలు కడుతున్నది.

ఆమె ఈ ప్రణయ ప్రదర్శనానికి కంగారుపడలేదు. చిరునవ్వు నవ్వి, "చాలు, చాలు! నా అభిప్రాయం ఇదికాదు. మా వారికి నన్ను చూస్తే ఒక దురభిప్రాయం! నేనెవ్వరికీ అక్కర్లేదని! నన్ను వీధిలో పారేస్తే నల్లకుక్కయినా ముట్టదని! ఈయన పొరపాటు పడ్డట్టు కనిపిస్తుంది! ఆ విషయం నిన్నడిగి అనుమానం రహితం చేసుకుందామనుకుంటుండగా, దేవుడల్లే వచ్చి నువ్వే నా అనుమానం తీర్చావు. నన్ను బాధించకు. నాకు మా వారి మీద తప్ప మరెవ్వరమీదా భ్రమలేదు!" అన్నది.

***ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942***

***యువ కార్యాలయం, తెనాలి***